సాక్షి
వికారాబాద్
శుక్రవారం । 14 । ఫిబ్రవరి । 2025



ఆభరణాల కోసమే..

ఇటీవల హత్యకు గురైన వృద్ధురాలిని నగల కోసమే హత్య చేసినట్లు షాబాద్ సీఐ కాంతారెడ్డి ప్రకటించారు. 8లో▸



హైవేపై.. వడాపావ్

'వడాపావ్'.. ఈ పేరు వింటేనే ముంబయి, పూణే, నాగపూర్ వంటి మహారాష్ట్ర నగరాలు గుర్తుకొస్తాయి. 8లో▸



వేధిస్తున్న సిబ్బంది కొరత!

పూడూరు తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది లేక పనుల కోసం వచ్చే వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

ధారూరు ఇన్‌చార్జి ఎస్‌ఐగా సంగమేశ్వర్

ధారూరు: ధారూరు ఠాణా ఇన్‌చార్జి ఎస్‌ఐగా సంగమేశ్వర్‌కు బాధ్యతలు అప్పగించారు. ఈనెల 11న ఓ బాధితుని నుంచి రూ.30 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్ జైలుకు వెళ్లారు. ఆయన స్థానంలో కొత్త ఎస్‌ఐ వచ్చేవరకు ఇచ్‌చార్జి బాధ్యతలను ఏఎస్‌ఐకి అప్పగించారని ధారూరు సీఐ రఘురాం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

దోమ ఎంపీడీఓగా గ్యామా

దోమ: దోమ ఎంపీడీఓగా పి.గ్యామా గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన హెచ్.మహేశ్‌బాబు ఇటీవల హైదరాబాద్‌లోని గ్రామీణ అభివృద్ధి కార్యాలయానికి బదిలీపై వెళ్లగా.. ఆయన స్థానంలో మేడ్చల్ జిల్లా కీసర ఎంపీడీఓగా పనిచేస్తున్న గ్యామా బదిలీపై దోమకు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన ఆయన మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకువెళ్తానన్నారు. సమస్యలు తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు.

బీరోల్ సరిహద్దులో చిరుత!

బంట్వారం: కోట్‌పల్లి, వికారాబాద్ మండలాల పరిధిలోని బీరోల్, మదన్‌పల్లి సరిహద్దులో గురువారం రాత్రి 8.30 గంటల ప్రాంతంలో చిరుత సంచరించినట్లు స్థానికులు గుర్తించారు. ఇదే విషయాన్ని బీరోల్ గ్రామస్తులు వెంటనే ఫారెస్టు అధికారులకు సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకుని ఆనవాళ్లను పరిశీలించి గాలింపు చర్యలు చేపట్టారు. ఇదిలా ఉండగా.. రెండు రోజుల క్రితం అనంతగిరి అడవిలో రోడ్డు దాటుతూ కనిపించిన చిరుత బీరోల్, మదన్‌పల్లి అటవీ ప్రాంతంలో తిరుగుతున్నట్లు చర్చలు వినిపిస్తున్నాయి.

అక్రమ మద్యంపై ఉక్కుపాదం మోపాలి

సాక్షి, సిటీబ్యూరో: అక్రమ మద్యం సరఫరాపై ఉక్కుపాదం మోపాలని రంగారెడ్డి జిల్లా డిప్యూటీ కమిషనర్ పి.దశరథ్ అధికారులను ఆదేశించారు. నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్‌పై గట్టి నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. గురువారం జిల్లా అధికారులు, ఉద్యోగులతో జరిగిన సమీక్ష సమావేశంలో ఈ మేరకు ఆయన దిశానిర్దేశం చేశారు. నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌ను అరికట్టినప్పుడే ఎక్సైజ్ లిక్కర్ అమ్మకాలు పెరుగుతాయని పేర్కొన్నారు. గంజాయి, డ్రగ్స్ అమ్మకాలపై నిఘా పెంచాలన్నారు. పట్టుబడిన గంజాయి, డ్రగ్స్‌ను వెంటనే డిస్పోజల్ కమిటీ అనుమతి తీసుకొని కాల్చివేయాలన్నారు. జనవరిలో 197 కేసుల్లో 149 మందిని అరెస్టు చేసి 7,904 కిలోల బెల్లం, 81.72 కేజీల గంజాయి, ఇతర డ్రగ్స్‌ను పట్టుకోవడం అభినందనీయమన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ ఆర్.కిషన్, శంషాబాద్, సరూర్‌నగర్, మేడ్చల్, మల్కాజిగిరి, వికారాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు కృష్ణప్రియ, ఉజ్వల రెడ్డి, ఫయాజొద్దీన్, నవీన్, విజయ భాస్కర్ పాల్గొన్నారు.

రంగరాజన్‌పై దాడి కేసులో మరో ఇద్దరి రిమాండ్

మొయినాబాద్: రామరాజ్యం సైన్యం పేరుతో చిలుకూరు బాలాజీ దేవాలయం అర్చకుడు రంగరాజన్‌పై జరిగిన దాడి కేసులో మొయినాబాద్ పోలీసులు గురువారం మరో ఇద్దరు నిందితులను రిమాండ్‌కు తరలించారు. కేసు విచారణ వేగవంతం చేసిన వారు రంగరాజన్‌పై జరిగిన దాడిలో ప్రమేయం ఉన్న నిందితులందరినీ పట్టుకోవడానికి గాలింపు చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే 12 మందిని అరెస్టు చేసి చేసి రిమాండ్‌కు తరలించగా తాజాగా మరో ఇద్దరిని రిమాండ్ చేశారు. ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన లక్ష్మణ్, వెంకటేశ్వర్లును బుధవారమే వారి సొంత జిల్లాలో పట్టుకున్నారు. మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి గురువారం రిమాండ్‌కు తరలించారు.

దాడి హేయమైన చర్య

మొయినాబాద్: చిలుకూరు బాలాజీ దేవాలయం అర్చకుడు రంగరాజన్‌పై దాడి చేయడం హేయమైన చర్య అని గౌడ కుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు రేనట్ల మల్లేష్‌గౌడ్ అన్నారు. గౌడ కుల హక్కుల పరిరక్షణ సమితి నాయకులు గురువారం చిలుకూరు బాలాజీ దేవాలయానికి వెళ్లి రంగరాజన్‌ను పరామర్శించారు. దాడి జరిగిన విషయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్చకుడిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాముడి పేరు చెప్పి అర్చకుడిపై దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పరామర్శించినవారిలో గౌడ కుల హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు నర్సింహగౌడ్, మండల అధ్యక్షుడు అంజయ్యగౌడ్ ఇతర నాయకులు ఉన్నారు.

మనసున మనసై..

ప్రేమ.. రెండక్షరాల మధుర భావన.. మాటల కందని తియ్యని అనుభూతి.. మనసును ఓలలాడించే ఓ అద్భుత కావ్యం.. రెండు మనసుల కలయిక.. రెండు హృదయాల గుండె చప్పుడు.. ప్రేమ ఓ సాగరం.. ఇలా వర్ణించుకుంటూ పోతే పదాలు చాలవు.. ఎందరో సినీకవుల కలం నుంచి ప్రేమపై మధుర గీతాలు జాలువారాయి.. ఎందరో దర్శకులు విభిన్నమైన ప్రేమ కథా చిత్రాలను తీసి విజయవంతం కాగలిగారు.. ప్రేమ గురించి.. ప్రేమికుల గురించి ఎంత చెప్పినా తక్కువే.. నేడు 'ప్రేమికుల దినోత్సవం' సందర్భంగా ప్రేమ లోకంలో విహరించి.. పెద్దలను ఎదురించి.. ఒప్పించి.. మెప్పించి మూడుముళ్ల బంధంతో ఒక్కటైన పలు జంటలపై ప్రత్యేక కథనాలు..

❖ పెద్దలను ఒప్పించి..


శ్రవణ్ కుమార్, సరిత కుటుంబం

దుద్యాల్: కలిసి చదువుకున్నారు.. చదువుకునే రోజుల్లోనే మనసులు కలిశాయి.. ఎవరో ఒకరు స్థిరపడ్డాక పెళ్లి చేసుకోవాలనుకున్నారు.. అనుకున్నట్టుగానే ఆమె ఉద్యోగం సాధించింది.. కులాలు వేరు కావడంతో కొన్నాళ్లు తర్జనభర్జన పడ్డారు.. పెద్దలను ఒప్పించి ప్రేమ వివాహంతో ఒక్కటయ్యారు. దుద్యాల్ మండలం హస్నాబాద్‌కు చెందిన శ్రవణ్ కుమార్, వరంగల్‌కు చెందిన సరిత హైదరాబాద్‌లో ఎంబీఏ చదువుతున్న సమయంలో ప్రేమలో పడ్డారు. చదువు పూర్తి చేసుకుని ఇద్దరూ ఉద్యోగాల వేట మొదలు పెట్టారు. గ్రూప్స్‌నకు ప్రిపేరయ్యారు. పరీక్షలు రాశారు. సరితకు అటవీశాఖలో సెక్షన్ అధికారిగా ఉద్యోగం వచ్చింది. శ్రవణ్ కుమార్ స్వల్ప మార్కుల తేడాతో ఉద్యోగం అందుకోలేకపోయాడు. వివాహానికి కులాలు అడ్డు వచ్చాయి. శ్రవణ్ కుమార్ నాయీ బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన వాడు కాగా సరిత రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు. ఇద్దరూ తమ ప్రేమ విషయాన్ని పెద్దలకు చెప్పారు. మొదట్లో ఇరు కుటుంబాల వారు అంగీకరించలేదు. కొన్నాళ్లు వేచి చూసి చివరికి వారిని ఒప్పించి పెళ్లి చేసుకున్నారు. ప్రస్తుతం సరిత వరంగల్ అటవీ శాఖలో సెక్షన్ అధికారిగా విధులు నిర్వర్తిస్తుండగా శ్రవణ్ కుమార్ వ్యాపార రంగంలో స్థిరపడ్డారు. వీరికి ఇద్దరు సంతానం.

❖ ఎదిరించారు.. ఏడడుగులు వేశారు


పిల్లలతో నర్సింహులు దంపతులు

పరిగి: ప్రేమ పెళ్లిని పెద్దలు అంగీకరించలేదు.. ఒకరినొకరు అర్థం చేసుకున్న వారు పెళ్లి బంధంతో ఒక్కటయ్యారు. కొన్నాళ్లు ఇరు కుటుంబాలకు దూరమైనా తర్వాత అంతా కలిసిపోయి అన్యోన్యంగా జీవిస్తున్నారు. ఇప్పాయిపల్లి గ్రామానికి చెందిన కురుంపల్లి నర్సింహులు, పుల్లమ్మ ఒకరినొకరు ఇష్టపడ్డారు. కులాలు వేరు కావడంతో పెళ్లికి ఇరు కుటుంబాల పెద్దలు అంగీకరించలేదు. అయినా వెనుకడుగు వేయకుండా 2000 సంవత్సరంలో ఏడడుగులు వేశారు. ఇద్దరు సంతానంతో హాయిగా జీవనం సాగిస్తున్నారు. కొన్నాళ్లకు పెద్దలు అన్నీ మరిచిపోయి కలిసిపోయారు. 'కొన్నాళ్లు ఇరు కుటుంబాల వారు దూరంగా ఉండడంతో బాధగా ఉండేది.. ఇప్పుడు అంతా కలిసిపోవడం ఆనందంగా ఉంది..' అంటోంది ఆ జంట.

❖ మనసులు కలిశాయి..

చౌదర్‌గూడ మండలం వీరన్నపేట్ గ్రామానికి చెందిన తాండ్ర శివకుమార్, కవిత మనసులు కలిశాయి. ఇరు కుటుంబాలకు విషయం చెప్పగా అంగీకరించలేదు. 2012లో ప్రేమ పెళ్లి చేసుకున్నారు. అప్పటి నుంచి కష్టపడి వ్యాపారాలు చేస్తూ స్థిరపడ్డారు. ముగ్గురు సంతానంతో ఇంటిల్లి పాది సుఖసంతోషాలతో జీవనం సాగిస్తున్నారు. – పరిగి


తాండ్ర శివకుమార్ కుటుంబం

❖ ప్రేమ బంధానికి దశాబ్దం


నరేష్, అనురాధ దంపతులు

కొడంగల్: పట్టణంలోని మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన బొంకురు నరేష్ కుమార్ మండల పరిధిలోని రావులపల్లి గ్రామం గౌడ సామాజిక వర్గానికి చెందిన అనురాధను 12 ఏళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. దశాబ్ద కాలంగా ఏడడుగుల బంధానికి కట్టుబడి ఉన్నారు. విధి నిర్వహణలో భాగంగా అనురాధ కొడంగల్‌కు వచ్చే క్రమంలో నరేష్‌తో ప్రేమలో పడ్డారు. రెండేళ్ల తర్వాత 2013 ఆగస్టు 19న హైదరాబాద్ ఆర్యసమాజ్‌లో వివాహం చేసుకొన్నారు. ప్రస్తుతం అనురాధ అంగడిరాయిచూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఏఎన్ఎంగా పని చేస్తున్నారు. నరేష్ వ్యవసాయంతో పాటు ఇతర పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం కొడంగల్ కార్గిల్ కాలనీలో అద్దెకుంటూ సొంతింటిని నిర్మించుకుంటున్నారు. భార్యాభర్తలు కలిసి కట్టుగా కష్టపడి పనిచేస్తూ.. ప్రేమికుల దినోత్సవాన్ని సెలబ్రేట్ చేసుకోడానికి సిద్ధమయ్యారు.

❖ ప్రేమికుల దినోత్సవం రోజే పెళ్లి


సునీతసంపత్ దంపతులు

తాండూరు: ప్రేమించుకున్నారు.. పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకున్నారు.. 33 ఏళ్లుగా ఉమ్మడి కుటుంబంలో సంతోషంగా జీవిస్తున్నారు.. ముగ్గురు పిల్లల పెళ్లిళ్లు చేసి ఇప్పటికీ అన్యోన్య దంపతులుగా ఉంటూ ఆదర్శంగా నిలిచారు.. ప్రేమికుల దినోత్సవం రోజునే మూడు ముళ్ల బంధంతో ఒక్కటయ్యారు డాక్టర్ సంపత్‌కుమార్, సునీత దంపతులు. తాండూరు మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సునీత, బాలాజీ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ సంపత్‌కుమార్ దంపతులకు 1992లో వివాహం జరిగింది. కాలేజీ రోజుల్లోనే ప్రేమించుకున్నారు. తల్లిదండ్రులను ఒప్పించి పెళ్లి చేసుకొన్నారు. పెళ్లి తర్వాత ఉమ్మడి కుటుంబంలో కొనసాగుతూ.. మరోవైపు హాస్పిటల్, విద్యా సంస్థలను సమర్థవంతంగా నడిపిస్తున్నారు. సునీతసంపత్ దంపతులకు కూతురు ప్రజ్వలిత.. కుమారులు విహాసిత్, సుశాంత్ ఉన్నారు. వారిని బాగా చదివించి పెళ్లిళ్లు చేశారు. కొడుకులు, కోడళ్లు హైదరాబాద్ ఉంటూ వైద్య వృత్తిని కొనసాగిస్తున్నారు. తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్‌గా సునీతాసంపత్ రెండున్నరేళ్ల పాటు పదవిలో కొనసాగారు. మున్సిపల్ అభివృద్ధికి పాటుపడ్డారు. సంపత్‌కుమార్ రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉంటూ కాంగ్రెస్ పార్టీలో బలమైన నేతగా ఎదిగారు. 'దాంపత్యం అన్నాక గిల్లికజ్జాలు సాధరణమని.. ఒకరినొకరు అర్థం చేసుకుని ముందుకు సాగడమే జీవితం అని.. ప్రేమించడం తప్పు కాదని, తల్లిదండ్రులను ఒప్పించి పెళ్లి చేసుకోవడం ఉత్తమం' అని చెబుతున్నారు.

❖ లవ్ షాబాద్

షాబాద్‌లోని పహిల్వాన్ చెరువు కట్టపై లవ్ షాబాద్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. యువతీయువకులు, ప్రేమికులు ఇక్కడ ఫొటోలు దిగేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఈ లవ్ స్పాట్ వద్ద పలు టీవీ సీరియల్స్ కూడా తీశారు. – షాబాద్



పారిశ్రామిక సమ్మతి

పెంచిన పరిహారానికి మెజార్టీ అసైన్డ్ రైతుల అంగీకారం

- 547 ఎకరాల భూ సేకరణలో 507 ఎకరాలు పూర్తి
- ససేమిరా అంటున్న రోటిబండతండా, పులిచర్లకుంటతండా బాధితులు
- గురువారం కలెక్టర్ నిర్వహించిన సమావేశానికి గైర్హాజరు
- వీరినుంచి సేకరించాల్సింది 40 ఎకరాలే
- ఇక పట్టా భూములపై అధికారుల ఫోకస్


రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, చిత్రంలో తాండూరు సబ్-కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్: లగచర్ల రైతులతో కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సంప్రదింపుల కమిటీ ఏర్పాటు చేసిన చర్చలు గురువారం ముగిసాయి. ఇప్పటికే పోలేపల్లి, హకీంపేట రైతులుతో ఈ కమిటీ జరిపిన చర్చలు వంద శాతం సత్ఫలితాలివ్వగా.. చివరి సమావేశానికి కొందరు రైతులు హాజరుకాలేదు. దుద్యాల మండల పరిధిలోని లగచర్ల రెవెన్యూ గ్రామంలో 156.5 ఎకరాల అసైన్డ్ భూమి సేకరించాలని అధికారులు గుర్తించారు. ఇందులో 93 మంది భూములు కోల్పోనున్నారు. ఈ భూసేకరణ విషయంలో అధికారులు గతంలోనూ సంప్రదింపులు జరిపారు. చివరగా గురువారం నిర్వహించిన సమావేశంలో 36 మంది రైతులు హాజరై తమ 58 ఎకరాల అసైన్డ్ భూమి ఇచ్చేందుకు అంగీకరించారు. మరో ఐదుగురు రైతులు మృతి చెందగా వారి వారసులతో మాట్లాడి పరిహారం అందజేయాలని నిర్ణయించారు. లగచర్ల రెవెన్యూ పరిధిలో లగచర్లతో పాటు రెండు గిరిజన తండాలు ఉన్నాయి. లగచర్ల రైతులు భూములు ఇచ్చేందుకు అంగీకరించగా.. రోటిబండతండా, పులిచర్లకుంటతండా రైతులు తమ భూములు ఇచ్చేందుకు ససేమిరా అంటున్నారు. రెండు తండాల రైతులు కలెక్టర్ ప్రతీక్‌జైన్ సమక్షంలో జరిగిన సంప్రదింపుల కమిటీ సమావేశానికి సైతం గైర్హాజరయ్యారు.

చేపట్టాల్సిన భూ సేకరణ

భూములు	ఎకరాల్లో
అసైన్డ్ భూమి	547
ప్రభుత్వ భూమి	90
పట్టా భూములు	721
మొత్తం	1,358

గ్రామాల వారీగా సమావేశాలు

ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గంలోని దుద్యాల పరిధిలో ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న మల్టీ పర్పస్ ఇండస్ట్రియల్ కారిడార్ భూ సేకరణపై జిల్లా అధికారులు ఫోకస్ పెట్టారు. ఈ కారిడార్‌ను మూడు రెవెన్యూ గ్రామాలకు చెందిన ఐదు ఆవాసాల పరిధిలో 1,358 ఎకరాల్లో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సేకరణకు నిర్ణయించిన భూ భాగంలో ప్రభుత్వ భూములు, పేదలకు అసైన్డ్ చేసిన భూములు, రైతుల పట్టాభూములు ఉన్నాయి. మొత్తంగా ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటులో 800 మంది రైతులు తమ భూములు కోల్పోనున్నారు. కాగా ముందుగా మొత్తం భూ సేకరణ ఒకేసారి నిర్వహించాలని భావించిన అధికారులు లగచర్ల ఘటనతో కాస్త నెమ్మదించారు. ఇప్పుడు వ్యూహం మార్చి ముందుకు వెళ్తున్నారు. ముందుగా గ్రామాల వారీగా అసైన్డ్ భూమిని సేకరిస్తున్నారు. మొత్తం 547 ఎకరాలకు గాను 40 ఎకరాలు మాత్రమే భూసేకరణ మిగిలి ఉంది.


సమావేశానికి హాజరైన లగచర్ల రైతులు

చెక్కుల రూపంలో పరిహారం

పారిశ్రామిక వాడకు భూములు ఇచ్చేందుకు అంగీకరించిన రైతులకు చెక్కుల రూపంలో పరిహారం అందజేస్తామని కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. తమ భూములు ఇచ్చేందుకు అంగీకరించిన అసైన్డ్ రైతులకు ఎకరానికి రూ.20 లక్షల చొప్పున పరిహారం, మహబూబ్‌నగర్–చించోలి హైవే పక్కన డీటీసీపీ లేఅవుట్‌లో ఎకరాకు 150 గజాల చొప్పున ప్లాటు ఇస్తామని చెప్పారు. ఐదు గుంటల నుంచి అర ఎకరా వరకు భూమి కోల్పోయిన వారికి 75 గజాల ప్లాటు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. వీటితో పాటు అర్హతను బట్టి ఇందిరమ్మ ఇళ్లు, ఇంటికి ఒక ఉద్యోగం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని వివరించారు. చనిపోయిన రైతుల వారసులను గుర్తించి పరిహారం ఇస్తామన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, తాండూరు సబ్–కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, టీజీఐఐసీ జోనల్ మేనేజర్ ఓవీటీ శారద, అసిస్టెంట్ జోనల్ మేనేజర్ అజీమా సుల్తానా, దుద్యాల తహసీల్దార్ కిషన్ లగచర్ల రైతులు పాల్గొన్నారు.

గిరిజన వసతి గృహంలో విషాదం

- నిద్రలోనే చనిపోయిన పదోతరగతి విద్యార్థి
- అనుమానాస్పద మృతిగా కేసు


దేవేందర్ (ఫైల్)

కుల్కచర్ల: మండల కేంద్రంలోని గిరిజన వసతి గృహంలో విషాదం చోటు చేసుకుంది. విద్యార్థులు, హాస్టల్ సిబ్బంది తెలిపిన ప్రకారం.. వికారాబాద్‌మండలం మద్గుల్ చిట్టెంపల్లి టీకులబీడ్‌తండాకు చెందిన నేనావత్ సోనిబాయి–చందర్ దంపతులకు ముగ్గురు సంతానం. వీరిలో గణేశ్ ఇంటి వద్దనే ఉంటుండగా స్వప్న నస్కల్ కేజీబీవీలో చదువుతోంది. దేవేందర్(15) కుల్కచర్ల జెడ్పీహెచ్ఎస్‌లో పదోతరగతి చదువుతూ స్థానిక గిరిజన వసతిగృహంలో ఉంటున్నాడు. బుధవారం రాత్రి స్టడీ అవర్ తర్వాత అందరితో కలిసి నిద్రించాడు. గురువారం ఉదయం 6.30గంటల సమయంలో విద్యార్థులు స్నానానికి వెళ్లగా దేవేందర్ లేవకపోవడంతో పక్కనే ఉన్న విద్యార్థి విశాల్ వసతిగృహ సిబ్బందికి సమాచారం ఇచ్చాడు. వారు పరిగి ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వెల్లడించారు. విషయం తెలుసుకున్న బాలుడి తల్లిదండ్రులు ఆస్పత్రికి చేరుకుని కన్నీటి పర్యంతమయ్యారు. తమకుమారుడి మృతిపై అనుమానం ఉందంటూ కుల్కచర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అన్వేశ్‌రెడ్డి తెలిపారు. విషయం తెలుసుకున్న పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం అంజిలయ్య, ఉపాధ్యాయ బృందం విద్యార్థులతో కలిసి హాస్టల్‌కు వెళ్లి దేవేందర్ చిత్రపటానికి నివాళి అర్పించారు.

ప్రభుత్వ నిర్లక్ష్యమే: మాజీ ఎమ్మెల్యే కొప్పుల

పరిగి: గిరిజన హాస్టల్ విద్యార్థి మరణ వార్త తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి, గిరిజన సంఘం నాయకుడు గట్యానాయక్ పరిగి ప్రభుత్వాస్పత్రికి చేరుకున్నారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. విద్యార్థి మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. మృతుడి కుటుంబానికి రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యార్థి మృతిపై ప్రభుత్వం సత్వరమే విచారణ చేపట్టాలన్నారు. అనంతరం కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో మాట్లాడి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. జిల్లా ట్రైబల్ డెవలప్‌మెంట్ అధికారి(డీటీడీఓ) కమలాకర్‌రెడ్డి ఆస్పత్రికి చేరుకుని కుటుంబంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం నుంచి సాయం అందించేందుకు కృషి చేస్తామన్నారు.


కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

కుటుంబాన్ని ఆదుకుంటాం: ఎమ్మెల్యే టీఆర్‌ఆర్

పరిగి: విద్యార్థి కుటుంబాన్ని అన్నివిధాల ఆదుకుంటామని ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అన్నారు. హాస్టల్ విద్యార్థి మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పరిగి ప్రభుత్వాస్పత్రికి వెళ్లి తల్లిదండ్రులను పరామర్శించారు. అంత్యక్రియలకు ఆర్థికసాయం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాతూ.. విద్యార్థి మృతిపై ప్రభుత్వం విచారణ చేపడుతుందన్నారు. బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. బాలుడి సోదరుడికి ఔట్ సోర్సింగ్‌లో ఉద్యోగం కల్పించడంతో పాటు 80శాతం సబ్సిడీతో రుణం అందిస్తామన్నారు. ఆయన వెంట డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అయూబ్, ఎస్టీసెల్ మండల అధ్యక్షుడు తౌర్యానాయక్ ఉన్నారు.

22న నాసర్ పోలోలో ఈక్వెస్ట్రియన్ అర్హత పోటీలు

శంకర్‌పల్లి: ఈక్వెస్ట్రియన్ జాతీయ అర్హత పోటీలకు శంకర్‌పల్లి మండలం జన్వాడలోని నాసర్ పోలో వేదిక కానుంది. ఈనెల 22నుంచి రెండు రోజుల పాటు ఇక్కడ క్వాలిఫయింగ్ పోటీలు కొనసాగనున్నాయి. దేశంలోని సభ్యత్వం కలిగిన క్లబ్‌ల నుంచి శిక్షణ పొందిన హార్స్ రైడర్లు ఇందులో పాల్గొననున్నారు. అర్హత సాధించిన వారు జూనియర్ ఈక్వెస్ట్రియన్ 2025 చాంపియన్ షిప్‌లో పాల్గొంటారు. ఇందుకోసం నాసర్ పోలో సిద్ధమైందని, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే క్రీడాకారులకు అత్యాధునిక సదుపాయాలు కల్పిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. పోలో, షో జంపింగ్, డ్రెసాజ్ మూడు విభాగాల్లో పోటీలు ఉంటాయని స్పష్టంచేశారు.

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

పూడూరు: మండల పరిధిలోని కేజీబీవీలో, తెలంగాణ మోడల్ స్కూల్‌లో వంట చేసేందుకు హెడ్‌కుక్, అసిస్టెంట్ కుక్‌ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి సాయిరెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. హెడ్‌కుక్‌కు పదవ తరగతి, అసిస్టెంట్ కుక్‌కు 7వ తరగతి పాస్ అయిన వారు అర్హులని తెలిపారు. ఈ నెల 17న పూడూరు కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఇంటర్వ్యూలు ఉంటాయని అర్హులైన మహిళలు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

15న సెలవు దినంగా ప్రకటించాలి

తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం డిమాండ్

దుద్యాల్: గిరిజనుల, బంజారుల ఆరాధ్య దైవం అయిన సద్గురు సేవాలాల్ మహరాజ్ జయంతి సందర్భంగా ఈ నెల 15న ప్రభుత్వం సెలవు ప్రకటించాలని తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం డిమాండ్ చేసింది. గురువారం సంఘం మండల అధ్యక్షుడు రవినాయక్ విలేకర్లతో మాట్లాడుతూ.. గిరిజనులు భక్తిశ్రద్ధలతో ఆయన జయంతిని జరుపుకొంటారని, అందుకే ప్రభుత్వం సెలవు ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో సంఘం మండల ప్రధాన కార్యదర్శి తిరుపతినాయక్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత



ధారూరు: అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న బాధితులకు వైద్య ఖర్చుల నిమిత్తం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను గురువారం కాంగ్రెస్ నాయకులు అందజేశారు. శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఆదేశానుసారం ధారూరు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 22 మంది బాధితులకు రూ.4.50 లక్షల విలువైన చెక్కులను మండల కేంద్రంలో ఇచ్చారు. కార్యక్రమంలో ధారూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, వైస్ చైర్మన్ అశోక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాన్‌సింగ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రాములు, నాయకులు బాబాఖాన్, ఇబ్రహీం, రాజేందర్, పాండునాయక్, గఫార్, మల్లేశ్, ప్రభాకర్‌రెడ్డి, మున్నయ్య తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

ఎస్‌ఐ యాదగిరి



నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ యాదగిరి

దుద్యాల్: డ్రగ్స్ రహిత సమాజం ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తుందని ఎస్‌ఐ యాదగిరి అన్నారు. బుధవారం పొద్దుపోయాక దుద్యాల్ గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట కళాకారులతో మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలు, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఎస్‌ఐ మాట్లాడుతూ.. ప్రజలు సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అలాగే యువత వ్యసనాల బారిన పడి ప్రాణాలు కోల్పోయే స్థితికి చేరుతున్నారన్నారు. రాష్ట్రంలో డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక తరలిస్తున్న డీసీఎం సీజ్

బంట్వారం: అక్రమంగా ఇసుక తరలిస్తున్న డీసీఎంను పట్టుకున్న పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ శ్రీశైలంయాదవ్ తెలిపిన ప్రకారం.. తాండూరు నుంచి మర్పల్లి వైపు ప్రయాణిస్తున్న డీసీఎంను అనుమానంతో చెక్ చేయగా డ్రైవర్ వద్ద ఎలాంటి ధ్రువపత్రాలు లేవు. దీంతో వాహనాణాన్ని ఠాణాకు తరలించి కేసు నమోదు చేశామన్నారు.

సాగు భూములు నిషేధిత జాబితాలో!

యాచారం మండలం నల్లవెల్లి రెవెన్యూ పరిధిలోని సర్వేనంబరు 823లో రైతు దెంది రాంరెడ్డి కుటుంబ సభ్యులకు 14.15 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. వారికి పట్టాదారు, పాసు పుస్తకాలు సైతం వచ్చాయి. ఐదేళ్ల కిందట ఆయన కుటుంబీకులు పక్కనే ఓ రియల్ వ్యాపారి వెంచర్ చేయడంతో రోడ్డు నిర్మాణానికి 20 గుంటల భూమిని ఇచ్చారు. అందులో వ్యాపారి రోడ్డు వేశారు. కొద్ది రోజుల కింద చేపట్టిన భూ సర్వేలో వ్యవసాయ, రెవెన్యూ అధికారులు ఆ భూమిలో రహదారి నిర్మించారంటూ మొత్తం 823 సర్వే నంబర్‌ని నిషేధిత జాబితాలో రికార్డు నమోదు చేశారు.

- రైతుభరోసా అందక అన్నదాతల అగచాట్లు
- అధికారుల చుట్టూ ప్రదక్షిణలు
- సాగుకు యోగ్యం కాని భూముల జాబితాపై గందరగోళం
- యాచారంలో 500 ఎకరాలు బ్లాక్ లిస్ట్‌లో నమోదు



నల్లవెల్లి రెవెన్యూ పరిధిలో నిషేధిత జాబితాలో ఉన్న భూమి

యాచారం: మండల వ్యాప్తంగా ఇలాంటి ఘటనలు కోకొల్లలు. రైతులు తమ పిల్లల పెళ్లిళ్లు, ఉన్నత చదువుల ఖర్చుల నిమిత్తం కొంత భూమిని ఒప్పందాల ప్రకారం విక్రయించుకుంటున్నారు. కానీ అధికారులు చేపట్టిన సర్వేలో మొత్తం సర్వే నంబర్‌ను నిషేధిత జాబితాలో రికార్డు చేస్తున్నారు. దీంతో మిగిలిన భూములకు రైతు భరోసా రాక నానా అగచాట్లు పడుతున్నారు. ఇటీవల జరిగిన ప్రజాపాలన గ్రామ సభల్లో సాగు యోగ్యం లేని భూముల వివరాలతో కూడిన జాబితాను అధికారు లు గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద ఏర్పా టు చేశారు. గమనించిన కొంత మంది రైతులు ఫిర్యాదులు చేయగా, గమనించని మరి కొందరు ఇప్పుడిప్పుడే తెలుసుకొని లబోదిబోమంటున్నారు.

సర్వేనంబర్ల భూమి మొత్తం

మండల పరిధిలోని యాచారం, తమ్మలోనిగూడ, మొగుళ్లవంపు, మాల్, గునుగల్, చింతపట్ల, కొత్తపల్లి, నందివనపర్తి, తక్కళ్లపల్లి, నస్దిక్‌సింగారం, తాడిపర్తి, మొండిగౌరెల్లి తదితర గ్రామాల్లో రియల్ వ్యాపారులు కొన్నేళ్లుగా దాదాపు 3 వేల ఎకరాలకు పైగా వ్యవసాయ భూములను కొనుగోలు చేసి డీటీసీపీ, హెచ్‌ఎండీఏ వెంచర్లు చేశారు. ఆ సమయంలో రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌తో పాటు సర్వేనంబర్లలోని భూమిని కన్వర్షన్(వ్యవసాయేతర భూమిగా మార్చడం) చేసి డీటీసీపీ, హెచ్‌ఎండీఏ అనుమతులు పొందారు. రెవెన్యూ అధికారులు కన్వర్షన్ చేసే సమయంలో రికార్డు ప్రకారం ఆ భూమిని మాత్రమే తొలగించి అనుమతినివ్వాలి. అలా కాకుండా ఆ సర్వే నంబరు మొత్తం భూమిలో వెంచర్ ఏర్పాటు చేశారని రికార్డు చేయడంతో రైతు భరోసా రాకుండా పోతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇలా మండలంలోని పలు గ్రామాల్లో 500 ఎకరాలకు పైగానే నిషేధిత జాబితాలో ఉంది.

సాగు చేస్తున్నాం



మొగుళ్లవంపు గ్రామంలో సర్వేనంబరు 49లో రెండు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులో ఏటా పంటలు పండిస్తాను. భూమి పక్కనే పలు సర్వే నంబర్లలో రియల్ వ్యాపారులు వెంచర్లు చేశారు. పక్కనే ఉన్నందున నా భూమికి రైతు భరోసా రాకుండా నిషేధిత జాబితాలో పెట్టారు. సరి చేయమని అధికారుల చుట్టూ తిరుగుతున్నా. – జంగారెడ్డి, రైతు, మొగుళ్లవంపు

అవకాశం ఇస్తే చేస్తాం



ప్రభుత్వం ఆదేశాల మేరకు గ్రామాల్లో వారం, పది రోజుల పాటు సాగు, వ్యవసాయానికి యోగ్యం కాని భూములను గుర్తించాం. గ్రామ సభల్లో సాగుకు యోగ్యం కాని భూముల వివరాల జాబితా ప్రకటించాం. పలు గ్రామాల నుంచి 15కి పైగా ఫిర్యాదులు వచ్చాయి. వాటిని పరిశీలించి రైతు భరోసాకు మళ్లీ అవకాశం ఇస్తే ఆన్‌లైన్ చేస్తాం. – రవినాథ్, ఏఓ, యాచారం

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

- తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి
- నంబర్ ప్లేట్ లేని వాహనాల పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు

తాండూరు టౌన్: ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవని తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి హెచ్చరించారు. గురువారం నంబర్ ప్లేట్ లేని వాహనాల పట్టివేతపై సబ్‌డివిజన్ పరిధిలో పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో నంబర్ ప్లేట్ లేని 40 ద్విచక్ర వాహనాలను, మైనర్లు నడుపుతున్న 24 బైకులను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. వాహనాలకు నంబర్ ప్లేట్ లేకపోయినా, ఆర్టీఓ నిబంధనల ప్రకారం కాకుండా ఇష్టానుసారంగా ఉన్నా జరిమానా తప్పదన్నారు. నంబర్ ప్లేట్ వాహనాలను నడపడంతో రోడ్డు ప్రమాదాలు చేసి తప్పించుకుంటున్నారన్నారు. అందుకే వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిబంధనల ప్రకారం నంబర్ ప్లేట్ ఏర్పాటు చేసిన తర్వాతే వాహనాలను వదిలేస్తామన్నారు. అలాగే మైనర్లకు వాహనాలు ఇచ్చిన పలువురు బైకు యజమానులపై కేసు నమోదు చేశామన్నారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించకుండా వాహనాలను నడిపితే శిక్షార్హులని ఆయన హెచ్చరించారు. ఈ తనిఖీల్లో పట్టణ సీఐ సంతోష్ కుమార్, ఎస్సై రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సరోజినీనాయుడు జయంతి



వేదికపై మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

బొంరాస్‌పేట: కాంగ్రెస్ పార్టీ జాతీయ మొదటి అధ్యక్షురాలు, స్వాతంత్ర్య సమరయోధురాలు సరోజినీనాయుడు విద్యార్థులకు ఆదర్శనీయమని ఎంఈఓ హరిలాల్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఆమె జయంతిని ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆంగ్ల భాషా దినోత్సవంగా ప్రకటించడంతో విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, ఉపన్యాసం, స్పెల్–బీ, పలురకాల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఇందులో ఆంగ్లోపాధ్యాయులు శివరాజు, శ్రవంతి, సుశీల, నర్సింలు, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, మల్లయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

సైబర్ మోసం.. ఇద్దరి ఖాతాలు లూటీ

- టెలిగ్రామ్ చానెల్ పేరిట డాక్టర్ ఖాతా నుంచి రూ.80వేలు
- ఫేక్ యాప్ ఇన్‌స్టాల్ చేసి రూ.88 వేలు

చేవెళ్ల: టెలిగ్రామ్ చానల్‌లో జాయిన్ అవ్వాలంటూ వచ్చిన మెసేజ్‌కు స్పందించిన ఓ పీజీ డాక్టర్ ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు రూ.80వేలు ఖాళీ చేశారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ కళాశాలలో పీజీ చదువుతున్న డాక్టర్ ఆదిత్య అప్పారావు మొబైల్‌కు ఈ నెల 10న 82660 75602 నంబర్ నుంచి మెసేజ్ వచ్చింది. మెసేజ్ క్లిక్ చేస్తూ వెళ్లిన డాక్టర్‌కు మరింత సమాచారం కోసం చానెల్ ఫాలో అవ్వాలని సందేశం పంపించారు. ఇందుకు స్పందించిన ఆయన బ్యాంకు ఖాతా నుంచి రూ.80 నగదు బదిలీ అయింది. ఆలస్యంగా చూసుకున్న బాధితుడు గురువారం చేవెళ్ల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

చైన్ సిస్టం యాప్‌లో రూ.88వేల పెట్టుబడి

టీచర్స్ కాలనీలో ఉండే పుష్పలతకు ఆమె స్నేహితులు ఎల్‌ఎఫ్‌ఎల్ యాప్‌లో డబ్బు ఇన్వెస్ట్ చేస్తే రెట్టింపు అవుతాయని.. చైన్ సిస్టం బిజినెస్ అని చెప్పి యాప్‌లింక్‌ను పంపించారు. దీంతో ఆమె డిసెంబర్ 8న యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని ఈ నెల 3వరకు రూ.88,623 పెట్టుబడి పెట్టింది. తదనంతరం యాప్ క్లోజ్ చేయడంతో ఓపెన్ కాలేదు. దీంతో ఆమె మోసపోయానని సైబర్ క్రైమ్ నంబర్ 1930కు ఫిర్యాదు చేసింది. గురువారం చేవెళ్ల ఠాణాకు వచ్చి ఫిర్యాదు చేయడంలో పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

శివమాలధారణ పవిత్రమైనది



మహా పడిపూజలో శివస్వాములు

కుల్కచర్ల: శివమాలధారణ ఎంతో పవిత్రమైనదని గురుస్వామి భూపాలాచారి అన్నారు. గురువారం చౌడాపూర్ గ్రామంలో జ్యోతిర్లింగా మహాపడి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక భావనలతో మానసిక ప్రశాంతత, ఏకాగ్రత వంటివి అలవడుతాయన్నారు. కార్యక్రమంలో శివస్వాములు తదితరులు పాల్గొన్నారు.

భారతి సిమెంట్‌కు తిరుగులేదు

సంస్థ టెక్నికల్ ఇంజినీర్ మహ్మద్ సాహెర్



బీమా బాండ్లను అందజేస్తున్న మహ్మద్ సాహెర్

ఇబ్రహీంపట్నం రూరల్: వ్యాపారంలో తిరుగులేని సంస్థగా భారతి సిమెంట్ ఎదుగుతుందని ఆ సంస్థ టెక్నికల్ ఇంజినీర్ మహ్మద్ సాహెర్ పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని సాయి శ్రీనివాస స్టీల్ ట్రేడర్స్ డీలర్ షాప్‌లో గురువారం తాపీ మేస్త్రీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతి సిమెంట్ రాష్ట్రంలో అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ 5 స్టార్ గ్రేడ్‌ను విడుదల చేసిందన్నారు. ఇంటి నిర్మాణంలో ముఖ్యంగా స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారులకు సరైనది భారతి సిమెంట్ అన్నారు. అల్ట్రాఫాస్ట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయాన్ని అందజేస్తామన్నారు. స్లాబ్ కాంక్రీట్ సమయంలో నిపుణులైన భారతి సిమెంట్ ఇంజినీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయ పడుతారని తెలిపారు. మార్కెట్లో లభించే ఇతర సిమెంట్లతో పోలిస్తే రూ.20 అధికంగా ఉంటుందని తెలిపారు. తాపీమేస్త్రీ రూ.లక్ష ప్రమాద బీమా బాండ్లను అందజేశారు. సమావేశంలో డీలర్ మహేందర్‌రెడ్డి, భారతి సిమెంట్ బృందం, తాపీమేస్త్రీలు పాల్గొన్నారు.


వర్గీకరణ సాధనపై సీఎంకు కృతజ్ఞతలు



సీఎం రేవంత్‌రెడ్డితో రాములు, సంపత్‌కుమార్

దౌల్తాబాద్: ముప్పై ఏళ్ల పోరాటాల ఫలితంగా ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని ప్రైవేటు ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంధంరాములు, ఉపాధ్యక్షుడు సంపత్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని వారు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడారు. వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుననుసరించి సీఎం రేవంత్‌రెడ్డి 82 రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణ అమలు చేయడం అభినందనీయమన్నారు. భారతదేశంలోనే ఎస్సీ వర్గీకరణ అమలు చేసిన మొదటి రాష్ట్రంగా తెలంగాణ నిలవనుందన్నారు. వర్గీకరణ అమలులో సీఎం చూపిన చొరవ ప్రశంసానీయమన్నారు.

కేసీఆర్‌ను కలిసిన నేతలు



అనంతగిరి: బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, బీసీ కమిషన్ మాజీ సభ్యులు శుభప్రద పటేల్ గురువారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి జిల్లా రాజకీయాలపై చర్చించారు.

దోమ ఇన్‌చార్జి ఎంపీఓగా రాజేశ్



దోమ: మండల ఇన్‌చార్జి ఎంపీఓగా పి.రాజేశ్ గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పని చేసిన ఎంపీఓ సోమలింగం చౌడాపూర్ మండలానికి ఇన్‌చార్జి ఎంపీడీఓగా బదిలీపై వెళ్లడంతో ఉన్నతాధికారులు గ్రేడ్–1 అధికారులలో సీనియర్ అయినా దిర్సంపల్లి పంచాయతీ కార్యదర్శికి మండల ఇన్‌చార్జి ఎంపీఓగా ఉన్నతాధికారులు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించి మాట్లాడారు. గ్రామాలలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు పంచాయతీ కార్యదర్శులతో సమన్వయం చేసుకుంటూ చర్యలు తీసుకుంటానని తెలిపారు.

అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్‌గా నాగేశ్వరరావు

అత్తాపూర్: రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేసిన నాగేశ్వరరావు అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్నారు. అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేసిన వెంకట్రాంరెడ్డి మల్టీ జోన్‌కు బదిలీపై వెళ్లారు. నూతనంగా బాధ్యతలు తీసుకున్న నాగేశ్వరరావు మాట్లాడుతూ..విధి నిర్వహణలో ఎలాంటి పక్షపాత ధోరని లేకుండా ఎప్పటికప్పుడు కేసులు పరిష్కరిస్తూ బాధితులకు అండగా నిలుస్తామన్నారు.

ఆభరణాల కోసమే దారుణం

ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న ఓ వ్యక్తికి అనుకోని పరిస్థితుల్లో పుట్టిన దుర్బుద్ధి అతడిని కటకటాల పాలు చేసింది. బంగారు ఆభరణాల కోసం వృద్ధురాలిని దారుణంగా హత్య చేసిన ఉదంతమిది.

- బంగారు, వెండి నగలు దోచుకునేందుకే వృద్ధురాలి హత్య
- వివరాలు వెల్లడించిన షాబాద్ సీఐ కాంతారెడ్డి



కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ కాంతారెడ్డి



స్వాధీనం చేసుకున్న నగలు

షాబాద్: ఇటీవల హత్యకు గురైన వృద్ధురాలిని బంగారు నగల కోసమే హత్య చేసినట్లు షాబాద్ సీఐ కాంతారెడ్డి ప్రకటించారు. ఈ మేరకు గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి కేసు వివరాలు వెల్లడించారు. ఈనెల 7న కొందుర్గు మండలం కాస్లాబాద్‌తండాకు చెందిన వత్యావత్ అనిల్‌కుమార్ కారులో షాద్‌నగర్ వైపు వస్తుండగా.. మార్గమధ్యలోని అప్పారెడ్డిగూడ గేటు వద్ద మన్‌మర్రి గ్రామానికి చెందిన బీబీ, జట్టని సత్యమ్మలు లిఫ్ట్ అడిగి ఎక్కారు. మార్గమధ్యలో మొగిలిగిద్ద వద్ద బీబీ కారు దిగింది. షాద్‌నగర్ కంటి ఆసుపత్రికి వెళ్తున్న సత్యమ్మ(65) కారులోనే ఉంది. ఆమె ఒంటిపై ఉన్న నగలను చూసి అనిల్‌కుమార్‌కు అత్యాశ పుట్టింది. నగలను దోచుకుంటే అప్పులు తీరుతాయని పథకం రచించాడు.

నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి

రంగంపల్లి బస్టాప్ సమీపంలోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి సత్యమ్మను ఒంటిపై ఉన్న నగలు ఇవ్వమని అడగ్గా నిరాకరించింది. దీంతో కోపోద్రిక్తుడై ఆమెపై దాడి చేశాడు. పొదల్లోకి ఈడ్చుకెళ్లి రాయితో తలపై మోది హత్య చేశాడు. తర్వాత ఆమె ఒంటిపై ఉన్న అర కిలో వెండి ఆభరణాలు, 5 తులాల బంగారు నగలు తీసుకొని ఉడాయించాడు. సత్యమ్మ ఇంటికి రాలేదని 8వ తేదీన కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, మిస్సింగ్ కేసు నమోదు చేశారు. సోమవారం ఉదయం షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రంగంపల్లి వద్ద గుర్తు తెలియని మహిళ వృద్ధురాలు మృతదేహం కనిపించడంతో కుటుంబసభ్యులకు సమాచారం అందించడంతో అక్కడికి వెళ్లి చూడగా సత్యమ్మగా గుర్తించారు. పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరా రికార్డులను పరిశీలించి కారు నంబర్ ఆధారంగా నిందితుడైన అనిల్‌కుమార్‌ను అదుపులోకి తీసుకొని తమదైన శైలిలో విచారించారు. బంగారు నగల కోసం హత్య చేసినట్లు నిందితుడు అంగీకరించడంతో రిమాండ్‌కు తరలించారు. కాగా మృతురాలికి భర్త అంజయ్య, ఇద్దరు కుమారులున్నారు. సమావేశంలో డిటెక్టివ్ సీఐ రమేష్ నాయుడు, ఎస్‌ఐ సతీష్‌కుమార్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ఆర్థిక సమస్యలతో వక్రమార్గం

ఫరూఖ్‌నగర్ మండలం అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన వత్యావత్ అనిల్‌కుమార్ తన అమ్మమ్మ ఊరైన కొందుర్గు మండలం కాస్లాబాద్ తండాలో స్థిరపడ్డాడు. అతని రెండు బొలెరో వాహనాల్లో రేషన్ బియ్యం సరఫరా చేస్తూ పోలీసులకు పట్టు పడడంతో కేసు నమోదైంది. జీవనోపాధి లేక ఆర్థిక ఇబ్బందులు సతమతమవుతున్నాడు. ఈ నేపథ్యంలోనే హత్యకు ఒడిగట్టాడు.



వడాపావ్‌లు తయారు చేస్తున్న లక్ష్మి

హైవేపై.. వడాపావ్



తినడానికి రెడీగా వడాపావ్‌లు

బొంరాస్‌పేట: 'వడాపావ్'.. ఈ పేరు వింటేనే ముంబై, పూణే, నాగపూర్ వంటి మహారాష్ట్ర నగరాలు గుర్తుకొస్తాయి. ఇది పేదవాడికి రుచికరమైన శాఖాహార అల్పాహారం. అలాంటి గరం గరం వడాపావ్‌కి మండల పరిధిలోని బీజాపూర్ జాతీయ రహదారిపై ఉన్న నాగిరెడ్డిపల్లి కేంద్రమైంది. దీని కోసం కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల వారితోపాటు కొడంగల్, పరిగి, తాండూరు, హైదరాబాద్ వాసులు హైవేపై వెళ్లేటప్పుడు ఇక్కడ ఆగి లొట్టలేసుకొని మరి తిని వెళ్లారు. గ్రామానికి చెందిన లక్ష్మి ముంబైకి వలస వెళ్లి కొంతకాలం కూలి పని చేసింది. అక్కడ అల్పాహారమైన వడాపావ్ ఆమెకు నచ్చింది. సొంతూరికి వచ్చాక అదే వంటకాన్ని తయారు చేసి స్వయం ఉపాధిగా పొందుతుంది. ఆలుగడ్డ, ఉల్లిపాయ, కొత్తిమీర, పుదీన, పచ్చిమిర్చి, ఉప్పు కలిపి వడ ముద్దలు చేసి వంట నూనెలో మరిగించి బ్రెడ్‌లో పెట్టి ఇస్తే చాలు వడాపావ్ రెడీ. 12 ఏళ్లుగా గ్రామంలోని జాతీయ రహదారిపై తయారుచేసి లక్ష్మి అమ్ముకుంటుంది. రోజూ రూ.2 వేల వరకు గిరాకీ వస్తుందని చెబుతోంది. స్వయం ఉపాధిగా తనకు వడాపావ్ ఎంతో ఆసరానిస్తోందని ఆమె అంటుంది.

పోలీసు కస్టడీకి మస్తాన్‌సాయి

మణికొండ: యువతుల నగ్న వీడియోలు, డ్రగ్స్, బెదిరింపులు, హత్యాయత్నం కేసులో చంచల్‌గూడ జైలు రిమాండ్ ఖైదీగా ఉన్న మస్తాన్‌సాయిని నార్సింగి పోలీసులు గురువారం కస్టడీకి తీసుకున్నారు. సాయంత్రం అతడిని నార్సింగి పీఎస్‌కు తీసుకు వచ్చిన పోలీసులు అతడిపై లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ కొనసాగిస్తున్నారు. మస్తాన్ సాయికి డ్రగ్స్ సరఫరా చేస్తున్న వారి వివరాలు, అతను నగ్న వీడియోలు తీసేందుకు కారణాలు, వాటిని అడ్డు పెట్టుకుని చేసిన బ్లాక్ మెయిల్‌ల వివరాలను రాబడుతున్నారు. లావణ్య పోలీసులకు అందించిన హార్డ్ డెస్క్‌లో ఉన్న వీడియోలపై ప్రశ్నించినట్లు తెలిసింది. శనివారం సాయంత్రం వరకు అతను పోలీసు కస్టడీలో ఉండనున్నారు. అప్పటిలోగా అతడి నుంచి కేసుకు సంబంధించి పూర్తి వివరాలను రాబట్టేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. లావణ్య ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ ఆమెతో చనువుగా ఉన్న వీడియోలు వెలుగులోకి రావడంతో అతడిని ఐజీ కార్యాలయానికి అటాచ్ చేశారు. ఈ నేపథ్యంలో ప్రత్యేక అధికారులతో విచారణ కొనసాగిస్తున్నట్లు తెలిసింది.

రాజ్‌తరుణ్‌కు క్షమాపణలు చెబుతున్నా: లావణ్య

సినీ హీరో రాజ్‌తరుణ్‌కు కాళ్లు పట్టుకుని క్షమాపణ చెప్పాలని ఉందని.. తన జీవితాన్ని కోల్పోయానని.. హీరోయిన్ మాల్వీ మల్హోత్రతో సన్నిహితంగా ఉన్నాడన్న అనుమానంతోనే తాను గతంలో రాజ్‌తరుణ్‌పై కేసు పెట్టానని లావణ్య పేర్కొంది. గురువారం ఆమె తన నివాసంలో న్యాయవాది నాగూర్‌బాబుతో కలిసి మీడియాతో మాట్లాడారు. తాను జైలులో ఉన్నప్పుడు అందిన తప్పుడు సమాచారంతో పొరపాటు జరిగిందన్నారు. మస్తాన్‌సాయి అతని తల్లితండ్రులు తనను చంపేస్తారని, గతంలో అతను దాడి చేశాడన్నారు. మస్తాన్‌సాయి తీసిన నగ్న వీడియోల్లో 44మంది యువతులు ఉన్నారని, వారిలో 15 మంది యువతులకు తెలియకుండా తీసిన వీడియోలు ఉన్నట్లు తెలిపింది. హార్డ్ డిస్క్‌లో 250లకు పైగా వీడియోలు ఉన్నట్లు పేర్కొంది. మస్తాన్‌సాయి తాను చేసిన తప్పులనుంచి తప్పించుకోలేడని, ఇకనైనా అతను ఇలాంటి చర్యలను మానుకోవాలని సూచించింది. అతని ఒత్తిడి తట్టుకోలేక నలుగురు యువతులు ఇతర దేశాల్లో తలదాచుకుంటున్నారని తెలిపింది. ఆమె తరపు న్యాయవాది నాగూర్‌బాబు మాట్లాడుతూ.. వీడియోలను లావణ్య లీక్ చేయలేదని, లావణ్యకు సంబంధించిన వీడియోలను లీక్ చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మస్తాన్‌సాయిని పోలీసులు ఎందుకు అరెస్టు చేయలేదని ఆయన ప్రశ్నించారు.